# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 8 ఫిబ్రవరి 2025 | HYDERABAD




## స్వల్పంగా.. తగ్గుముఖం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.7 డిగ్రీలు, కనిష్ఠం 19.6 డిగ్రీలు, గాలిలో తేమ 44 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## మళ్లీ రేషన్ కార్డులు ఇచ్చేది ఎప్పుడు?

మేడ్చల్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లావ్యాప్తంగా 1.44 లక్షల దరఖాస్తులు వస్తే 118 మంది లబ్ధిదారులకు మాత్రమే రేషన్‌కార్డులు అందజేసిన విషయం తెలిసిందే. ప్రజాపాలన, గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ ఎప్పుడు రేషన్ కార్డులు అందిస్తారని ఎదురు చూపులు చూస్తున్నారు. కాగా, మార్పులు-చేర్పులలో భాగంగా 10,500 వందల రేషన్ కార్డులలో మార్పులు-చేర్పులు చేసి కార్డులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే మిగతా వారికి రేషన్ కార్డులు ఎప్పుడు అందుతాయని ఎదురుచూస్తున్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా వచ్చిన రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని అధికారులు వెల్లడిస్తున్నారు. సర్వే పూర్తయితే లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు జరుగుతుందన్న సందేహాలను దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు.







## దద్దరిల్లిన ఓయూ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 7: ఓయూ సైన్స్, నిజాం కాలేజ్, సైఫాబాద్ పీజీ కాలేజ్, సికింద్రాబాద్ కాలేజ్ సైన్సు విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఓయూ పరిపాలనా భవన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ నెల 18 నుంచి జరగనున్న మొదటి , మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

# భయపెడుతున్న గన్



**పెరుగుతున్న తుపాకుల వినియోగం**

### ఉత్తరాది నుంచి అక్రమంగా ఆయుధాల రవాణా

### అదనపు ఆదాయ వనరుగా తుపాకుల అమ్మకం

### నిఘా కండ్లు కప్పి తప్పించుకుంటున్న అక్రమార్కులు

**సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ):**

- **2024సెప్టెంబర్‌లో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో గంజాయి ముఠాను పట్టుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై ముఠా సభ్యులు కాల్పులు జరిపారు.**
- **2024 నవంబర్‌లో హైదరాబాద్ సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటేశ్వరకాలనీలో ఓ వ్యక్తి తను ప్రేమించిన అమ్మాయి తండ్రిపై ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపారు.**
- **15.01.2025 ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ బీహార్ నుంచి మూడు తుపాకులు, పది బుల్లెట్లు ఖరీదు చేసుకుని నగరానికి చేరుకున్నాడు. ఇక్కడి నేరగాళ్లకు విక్రయించే క్రమంలో రాచకొండ ఎస్‌వోటీ పోలీసులకు చిక్కాడు**
- **16.01.2025 కర్ణాటకలోని బీదర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సిఎంఎస్ వాహనంపై బిహార్ దొంగలు విరుచుకుపడ్డారు. అక్కడ రూ.87లక్షల దోచుకుని అఫ్జల్‌గంజ్ చేరుకుని, ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరిపారు.**
- **01.022025 ప్రిజం పబ్ వద్ద మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ సైబరాబాద్ సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపాడు. అతడి నుంచి పోలీసులు మూడు తుపాకులు, 451 తూటాలు స్వాధీనం చేసుకున్నారు.**



**నెలరోజుల్లోనే** హైదరాబాద్‌లో జరిగిన ఘటనలే మూడు ఉన్నాయంటే అక్రమ ఆయుధాల వినియోగం తీవ్రత ఎంతగా ఉందో తెలుస్తోంది. గ్రేటర్‌లో అక్రమ ఆయుధాలు సమకూర్చుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కారణాలేవైనా తుపాకులు పేలేవరకు పోలీసులకూ తెలియడం లేదు. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల నుంచి నగరానికి వస్తున్న ఆయుధాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి. ఇటీవల నగరంలో జరిగిన సంఘటనలు చూస్తే ఈ పరిస్థితి అర్థమవుతుంది. ఆయుధాలతో పాటు ఆ దందాలు చేసే వారిపైనా పూర్తి స్థాయిలో నిఘా ఉండకపోవడం మూలాన ఎక్కడపడితే అక్కడ నాటు తుపాకులు లభిస్తున్నాయి. దీంతో నేరగాళ్లు వీటిని వినియోగిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గచ్చిబౌలిలో కాల్పులు జరిపిన బత్తుల ప్రభాకర్‌కు పెద్ద నేర చరిత్ర ఉంది. అయితే అతడు ఆయుధం వినియోగించడం ఇదే మొదటిసారి.

### అక్రమ ఆయుధాలకు కేరాఫ్..!

ఒకప్పుడు ఢిల్లీ, ముంబైలకు ఉత్తరాది నుంచి ఆయుధాలు సరఫరా అయ్యేవి. కానీ ఇప్పుడు హైదరాబాద్‌కు ఆయుధాల అక్రమ రవాణా పెరిగిందని ఒక పోలీస్ అధికారి చెప్పారు. సహజంగా బెదిరింపులు, దోపిడీలు, కిడ్నాపులు, హత్యలు.. ఇవన్నీ చేయాలంటే గన్స్ ఉండాలని నేరస్తులు భావిస్తున్నారు. వెంటవెంటనే సమస్య పరిష్కరించుకోవాలంటే పిస్టల్స్, రివాల్వర్స్ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రౌడీషీటర్లు, నేరస్తుల చేతుల్లోనే 80శాతం వరకు ఆయుధాలు ఉన్నాయని అంచనా. వీటిని రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల నుంచి తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం పాతబస్తీలో నేరస్తులు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో అత్యాధునిక పిస్టళ్లు, తుపాకులు, రివాల్వర్లున్నాయి. హైదరాబాద్ నగరంలో పోలీసుల అనుమతితో పదివేల వరకు ఆయుధాలుంటే.. అనధికారికంగా సుమారు 35వేల వరకు ఉన్నట్లు పోలీసులు అంచనావేస్తున్నారు. హైదరాబాద్ నగరానికి పలు రాష్ట్రాల నుంచి తుపాకులు సరఫరా చేయడానికి ప్రత్యేక ముఠాలు పనిచేస్తున్నాయి. అక్రమ ఆయుధాలను రాజస్థాన్‌లోని జయపుర, బిహార్‌లోని గయ, ముంగేర్, పాట్నా, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, బర్వానీలలో తయారు చేస్తున్నారు. అక్కడి కరుడుగట్టిన ముఠాలు వీటిని తక్కువ ధరకు అందిస్తున్నాయి. ఆయుధాల రవాణాకు రైలుమార్గం ఒక వరంగా మారింది. జనరల్ బోగీల్లో తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండడంతో వీటిలోనే ఆయుధాలు రవాణా చేస్తున్నారు. శివారు రైల్వేస్టేషన్లలో దిగివెళ్లిపోతున్నారు. వీటికి తోడు ట్రాన్స్ పోర్ట్ లారీలు, కొన్నిసార్లు ప్రైవేటు బస్సుల్లోనూ ఇవి నగరానికి వస్తున్నాయి.

### ఆదాయవనరుగా..!

నగరానికి ఉత్తరాది నుంచి నగరానికి వలసలు పెరగడంతో ఆయుధాలు తెప్పించుకోవడం సులభమవుతోంది. ఓ పక్క ముఠాలే కాకుండా అక్కడినుంచి వచ్చే దినసరి కూలీలు సైతం ఆయుధ వ్యాపారాన్ని అదనపు ఆదాయ వనరుగా భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సమయంలో తమతోపాటు అక్కడి ఆయుధాలను తక్కువ ధరకు కొని ఆ తరవాత వాటిని ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. పనుల కోసం నగరంలో స్థిరపడిన బిహారీ, ఇతర రాష్ట్రాల వారు తాము తమ ప్రాంతం నుంచి సిటీకి రాకపోకలు సాగించే సమయంలో ఈ దందా చేస్తున్నారు. పోలీసు నిఘా ఎంత పటిష్టంగా పనిచేసినా చివరకు ఎక్కడో ఒక దగ్గర కాల్పుల మోతలు, ఆయుధాల స్వాధీనం వంటి ఘటనలు తరచూగా జరుగుతూనే ఉన్నాయి.

**అక్రమ ఆయుధాల ధరలు :**

- **తపంచా :** రూ.5వేల నుంచి రూ.8వేల వరకు
- **రివాల్వర్ :** రూ.25వేల నుంచి రూ.50వేలు
- **పిస్టల్ :** రూ.30వేల నుంచి రూ.60వేలు
- **ఆటోమేటెడ్ పిస్టల్ :** రూ.80వేలకు పైగా
- **ఆటోమేటెడ్ రివాల్వర్ :** రూ.90వేలకు పైగా

## అరుదైన వ్యాధిగ్రస్తులకు అండగా నిమ్స్

### ఏటా దాదాపు 12వేల జెనటికల్ డిజార్డర్ రోగులకు చికిత్స

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): అరుదైన జెనటికల్ డిజార్డర్ వ్యాధిగ్రస్తులకు అండగా నిలుస్తోంది నిమ్స్ వైద్యశాల. ఈ వ్యాధులు చాలా అరుదుగా, నూటికో, కోటికో ఒకరికి వస్తుంటాయని చెబుతున్నారు వైద్యులు. అయితే దురదృష్టవశాత్తు ఈ అరుదైన వ్యాధుల్లో అతి తక్కువ వ్యాధులకు మాత్రమే చికిత్స అందుబాటులో ఉందని, మిగిలిన వాటికి చికిత్స లేదని నిమ్స్ జనటికల్ విభాగం అధిపతి డాక్టర్ షాగున్ అగర్వాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 12సెంటర్లు ఉండగా, అందులో ఒకటి నగరంలోని నిమ్స్ ఒకటని, ఈ చికిత్సా కేంద్రాల్లో మాత్రమే జెనటికల్ డిజార్డర్ రోగులకు చికిత్స అందిస్తామని వివరించారు.

### 8వేల రుగ్మతల్లో..

అరుదైన జెనటికల్ డిజార్డర్స్‌లో ఇప్పటి వరకు వెయ్యి నుంచి 8వేల వ్యాధులను గుర్తించారని, అందులో ఇప్పటి వరకు కేవలం 60 వ్యాధులకు మాత్రమే చికిత్స అందుబాటులో ఉన్నట్లు డా.షాగున్ అగర్వాల్ వివరించారు. వీటికి సంబంధించిన రోగులకు నగరంలోని నిమ్స్ జెనటికల్ డిజార్డర్ విభాగంలో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అయితే ఈ సెంటర్‌కు కేవలం తెలంగాణ నుంచే కాకుండా దక్షిణ భారత దేశంలోని మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, కేరళ ప్రాంతాల నుంచి కూడా రోగులు వస్తుంటారని తెలిపారు.

### ప్రతి రోగికి రూ.50లక్షలు

చికిత్సలో భాగంగా జెనటికల్ డిజార్డర్ ఉన్న ఒక్కో రోగికి రూ.50లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయిస్తుందని, ఈ డబ్బుతో రోగికి పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తామని డాక్టర్ షాగున్ తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లోని జెనటిక్ డిజార్డర్ విభాగంలో 121మంది రోగులు రిజిస్టరై ఉన్నట్లు వెల్లడించారు. వీరికి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

### 20 పడకలతో డే కేర్ సెంటర్

ఈ అరుదైన జెనటికల్ డిజార్డర్ రోగుల్లో కొన్ని రకాల రుగ్మతలతో బాధపడే రోగులకు మాత్రం చికిత్సలో భాగంగా ఇచ్చే మందును ఐవీ ద్వారా మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. అందుకోసం వారిని దవాఖానలో అడ్మిట్ చేయాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గత సెప్టెంబర్‌లో డే కేర్ సెంటర్‌ను ప్రారంభించినట్లు డా. షాగున్ తెలిపారు. ప్రస్తుతం 25మంది రోగులకు ఈ డేకేర్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో ప్రధానంగా రెండు రకాల అరుదైన జెనటికల్ డిజార్డర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అందులో 1.కాషర్ డీసీజ్, 2.పాంపె డీసీజ్ లకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.





### ఈఆర్‌టీ ద్వారా చికిత్స అందిస్తున్నాం



వంశపార్యపరంగా వచ్చే కొన్ని జన్యుపరమైన లోపాలతో ఏర్పడే రుగ్మతలనే వైద్యపరిభాషలో జెనటికల్ డిజార్డర్ అంటారు. ఇప్పటి వరకు వెయ్యి నుంచి 8వేల జెనటికల్ డిజార్డర్స్‌ను గుర్తించారు. అయితే అందులో కేవలం 60వ్యాధులకు మాత్రమే చికిత్స అందుబాటులో ఉంది. ఈ వ్యాధులకు సంబంధించిన చికిత్స చాలా ఖరీదైన, క్లిష్టమైనది కావడం వల్ల ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 12 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో ఒక సెంటర్‌ను 2021లో అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే చికిత్స అందుబాటులో ఉన్న 60 రకాల జెనటికల్ డిజార్డర్స్‌ల్లో కొన్నింటికి మాత్రం ఐవీ ద్వారా చికిత్స అందించాల్సి ఉంటుంది. మిగిలిన వ్యాధులకు హోమ్ కేర్ ద్వారా చికిత్సను డే కేర్‌లో అందిస్తున్నాం. ప్రస్తుతం నిమ్స్‌లో కాషర్, పాంపె అనే అరుదైన జెనటికల్ వ్యాధిగ్రస్తులకు ఎంజైమ్ రీప్లేస్‌మెంట్ థెరపి(ఈఆర్‌టీ) అనే ప్రత్యేక చికిత్సను డే కేర్‌లో అందిస్తున్నాం. ఈ చికిత్సను ప్రతి రెండు వారాలకు ఒకసారి ఐవీ ద్వారా అందించాల్సి ఉంటుందన్నారు. ఈ చికిత్స అందించేందుకు కనీసం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతున్నందున రోగులకు ఈ చికిత్సను డే కేర్‌లో ఇస్తున్నాం. ఓవరాల్‌గా ప్రతి సంవత్సరం సుమారు 12వేల మంది జెనటికల్ డిజార్డర్ రోగులకు ఈ సెంటర్ ద్వారా చికిత్స అందిస్తున్నాం.

**- డా.షాగున్ అగర్వాల్, జెనటికల్ డిజార్డర్ విభాగాధిపతి, నిమ్స్ హాస్పిటల్**

## మరో రూ.500కోట్లు వసూలు చేయాల్సిందే

### లక్ష్యం చేరాలంటే.. ఓటీఎస్ తప్పనిసరి!

సిటీబ్యూరో: ఆస్తిపన్ను వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు జీహెచ్‌ఎంసీ అపసోపాలు పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2100కోట్ల టార్గెట్ విధించుకోగా.. ఇప్పటి వరకు దాదాపు రూ.1416 కోట్ల మేర మాత్రమే చేరుకున్నారు. 12 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లించగా.. మరో ఐదు లక్షల మంది ఇంకా చెల్లించాల్సి ఉంటుంది. వీరి నుంచి దాదాపు రూ.684 కోట్ల మేర ఆదాయం రావాల్సి ఉంది. వచ్చే నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ఆస్తిపన్ను వసూళ్లను పెంచాలని నిర్ణయించిన అధికారులు.. ఈ మేరకు బకాయిదారులకు ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ అందిస్తూ ఓటీఎస్ స్కీంను అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతి ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ ప్రభుత్వాన్ని కోరేందుకు సిద్ధమైంది. ప్రతిపాదన కమిషనర్ ఇలంబర్తి పరిశీలనలో ఉంది. గ్రేటర్‌లో ప్రస్తుతం ఆస్తి పన్ను బకాయిలు రూ.5వేల కోట్ల వరకు ఉన్నాయి. ప్రభుత్వ ఆఫీసులకు సంబంధించిన పన్నులు రూ. 3వేల కోట్లు ఉండగా, రూ. 2 వేల కోట్లు ఆస్తిపన్ను దారుల నుంచి రావాల్సి ఉంది ఓటీఎస్‌ను అమలు చేస్తే రూ. 500కోట్ల మేర ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా. ఈ నెలాఖరులోగా అధికారికంగా ఓటీఎస్ అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే 10శాతం వడ్డీతో బకాయిదారులంతా తమ ఆస్తిపన్నును చెల్లించే వెసులుబాటు దొరుకుతుంది. ఓటీఎస్‌తో దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

## తులం బంగారం హామీ ఏమైంది?

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు నర్సింహయాదవ్, సతీశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మహేశ్వరీ తదితరులు

బాలానగర్, ఫిబ్రవరి 7 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చక లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. శుక్రవారం బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, పండాల సతీశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మహేశ్వరీలతో కలిసి ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 130 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తప్పుడు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 14 నెలలు గడుస్తున్నా...తులం బంగారం ఇవ్వకపోవడంపై పట్ల పేదింటి కుటుంబాలు అగ్రహం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు అధికార పక్ష నేతలకు కొమ్ము కాస్తున్నారని మండి పడ్డారు.

## ఉప ఎన్నికలు రాబోతున్నాయ్

### అన్నిచోట్లా గులాబీ జెండా ఎగురవేస్తాం.. మెట్రో ప్రాజెక్టు తరలిపోయింది..

### ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమాధానం చెప్పాలి..బీఆర్‌ఎస్ యువనేత కార్తిక్‌రెడ్డి



మణికొండ, ఫిబ్రవరి 7: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని.. అన్ని చోట్లా గులాబీ జెండా ఎగురవేస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాది కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ ప్రజా ఆగ్రహానికి గురయిందన్నారు. బీఆర్‌ఎస్‌లో గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో ముమ్మాటికీ బై ఎలక్షన్లు వస్తాయన్నారు. అన్ని చోట్లా బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపలి మున్సిపాలిటీలు,కాలనీలు, గ్రామాల ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండాలనే సంకల్పంతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.3వేల కోట్ల నిధులతో రిజర్వాయర్లను నిర్మించేందుకు నిధులను మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వాటిని ప్రారంభించి తామే చేశామనడం సిగ్గుచేటని కార్తిక్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి రావాల్సిన మెట్రో ప్రాజెక్టు తరలిపోయిందని, మెట్రో వచ్చి ఉంటే నియోజకవర్గ రూపురేఖలు మారిపోయేవని కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే పార్టీ మారిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నియోజకవర్గ ప్రజలు సమాధానం చెప్పాలన్నారు. అధికార పార్టీలోకి వెళ్లి తర్వాత రూపాయి తెచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై తామే చేశామని చెప్పుకోవడం దిగజారుడు తనమేనన్నారు. ఏం ప్రయోజనాల కోసం పార్టీ మారారో ఇప్పటికీ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నియోజకవర్గ ప్రజలకు చెప్పలేదని కార్తిక్‌రెడ్డి అన్నారు.

## రూ.150 కోట్ల పనులపై విజిలెన్స్!

### 538 చోట్ల నిర్వహణ పనుల్లో అక్రమాలు - విచారణకు ఆదేశించిన కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో గడిచిన కొన్నేండ్లుగా జరిగిన నిర్వహణ పనులపై విజిలెన్స్ రంగంలోకి దిగింది. 2021, 2022, 2023 సంవత్సరాల కాలంలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలంటూ ఆర్థిక శాఖకు అందుతున్న సంకేతాల నేపథ్యంలో అనుమానాలు వ్యక్తం చేసిన కమిషనర్ సమగ్ర విచారణ చేపట్టిన వాస్తవాలను నివేదిక రూపంలో అందజేయాలని విజిలెన్స్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగానే దాదాపు 538 చోట్ల పనుల బిల్లులలో దాదాపు రూ.150 కోట్ల మేర బిల్లులలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. వీటితో పాటు 2016 సంవత్సరం నుంచి తాజా పనుల వరకు 90 శాతం పనులపై విజిలెన్స్ విభాగం విచారణ జరపనుంది. ఈ నెలాఖరులోగా విజిలెన్స్ బృందం నివేదిక ఆధారంగా కమిషనర్ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.

GHMC

### దిద్దుబాటు చర్యలు

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం జరుగుతున్న వరద నీటి కాలువ, నాలా, రహదారులు ఇతరత్రా నిర్వహణ పనుల్లో అక్రమాలకు తావు లేకుండా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. జీహెచ్‌ఎంసీ చట్టం 1955 సెక్షన్ 171 ప్రకారం, మునిసిపల్ నిధుల నుంచి చెల్లింపునకు సంబంధించిన చెక్కులపై కమిషనర్/స్పెషల్ ఆఫీసర్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, ఆయన గైర్హాజరీలో సబార్డినేట్ సంతకం ఉండాలి. జీహెచ్‌ఎంసీ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా రూ.50 లక్షల వరకు పనుల జారీకి సంబంధించిన అధికారం జోనల్ కమిషనర్లకు కట్టబెడుతూ ఫిబ్రవరి 13, 2012లో నిర్ణయం తీసుకున్నారు. దీనిని 2019లో రూ.2 కోట్లకు పెంచారు. మే 1, 2024 నుంచి ఆన్‌లైన్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఆర్థిక సలహాదారు (ఎఫ్ఏ), ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆమోదంతో ఆర్థిక విభాగం నుంచి నేరుగా చెల్లింపులు జరుగుతున్నాయి. కేంద్ర కార్యాలయంలో జరిగే బిల్లుల చెల్లింపు వివరాల జాబితా కమిషనర్‌కు, జోన్లలో అక్కడి జోనల్ కమిషనర్లకు పంపి ఆమోదం తీసుకోవాలనే నిబంధన ఉంది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో ఎంత మేర చెల్లింపులు చేయాలనేది కమిషనర్ నిర్ణయిస్తారు. ఆ వివరాలు జోనల్ కమిషనర్లు పంపుతారు. ఇప్పటి వరకు జోనల్ కార్యాలయాల్లో దీనికి పాటించడం లేదు. ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో రెండు, మూడేళ్ల క్రితం పాలనాపరమైన ఆమోదం పొందిన పనులకు సంబంధించిన బిల్లులూ ప్రస్తుతం ఆర్థిక విభాగానికి వస్తున్నాయి. ఇక మీదనే జోనల్ కమిషనర్ ఆమోదం పొందిన తర్వాతనే బిల్లులు మంజూరు చేయనున్నారు.

### కాంట్రాక్టర్లను భయ పెట్టేందుకేనా?

జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్లకు రూ.1500 కోట్ల మేర బకాయీ పడింది. ఈ నేపథ్యంలో తరచు ఆందోళనలు చేయడం, జూన్ నాటికల్లా రూ.400 కోట్ల మేర బకాయిలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్లు తాత్కాలికంగా నిరసనను వాయిదా వేశారు. పాత బిల్లులపై అక్రమాలు జరిగాయన్న ఆరోపణల తరుణంలో నిర్వహణ పనులకు చెల్లించిన బిల్లులపై విజిలెన్స్ బృందం రంగంలోకి దిగి విచారణ చేపడుతున్నారు. కాంట్రాక్టర్లను భయపెట్టే చర్యల్లో భాగంగానే ఈ విచారణ జరుపుతున్నట్లు కొందరు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.